సాక్షి సంగారెడ్డి


సోమవారం ♦ 22 ♦ ఏప్రిల్ ♦ 2024



మామిడీలా..

వాతావరణంలో మార్పుల కారణంగా మామిడి దిగుమతి తగ్గి రైతులు డీలా పడ్డారు.

వివరాలు 8లో ▸



పల్లెకు ప్రకృతి అందాలు

గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి అందాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

వివరాలు 8లో ▸



దుకాణ సముదాయం..

జహీరాబాద్ డీసీఎంఎస్‌కి చెందిన దుకాణ సముదాయం వల్ల ఆదాయం పెరిగింది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రైతులను ఆదుకోవాలి



జొన్న పంటను పరిశీలిస్తున్న పృథ్వీరాజ్

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మంజీర రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని బొబ్బిలి గమ గ్రామంలో వర్షానికి దెబ్బతిన్న జొన్న, ఉల్లి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి నివేదిక అందించాలన్నారు. రైతులకు ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు మల్లేశం, బీరయ్య,అశోక్,రాజు,జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ



సిబ్బందితో హుస్సేన్

నారాయణఖేడ్: ఖేడ్ పశువైద్యశాఖ కేంద్రంగా సేవలు అందిస్తున్న 1962 అంబులెన్స్ వాహనాన్ని ఆదివారం ఈఎంఆర్ఐ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన సూపర్‌వైజర్ హుస్సేన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో ఉన్న పరికరాలు, మందులను పరిశీలించారు. వేసవిలో పశువులకు వ్యాధులు, వాటి నివారణకు అవసరమైన మందులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పైలెట్ ప్రవీణ్, సహాయకులు నరేష్‌కు వివరించారు.

హజ్ యాత్రికులకు సన్మానం



యాత్రికులను సన్మానిస్తున్న చంద్రశేఖర్

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని గడి వీధి హరి మసీద్ కమిటీ సభ్యులు హజ్ యాత్రకు వెళ్తున్న సందర్భంగా వారిని మాజీ మంత్రి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చంద్రశేఖర్ ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంజీ. రాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న రఘునందన్ రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రధాని మోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి రఘునందన్ అన్నారు. ఆదివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మైహోం అంకుర విల్లాస్‌లో పలువురు పార్టీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అనేక మంది స్వచ్ఛందంగా బీజేపీలో చేరుతున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి, కౌన్సిలర్ శంషాబాద్ రాజు, రామ్ నారాయణ, నగేష్, దినేష్, కార్తీక్, ఆదిత్య, రఘురామిరెడ్డి, దిలీప్ పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా భవానీచంద్ర

సంగారెడ్డి టౌన్: జిల్లాలో పలువురు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. సంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా రంగారెడ్డి జిల్లా రెండో అదనపు మెట్రో పొలిటన్ సెషన్ కోర్టు న్యాయమూర్తి జి.భవానీచంద్ర బదిలీపై రానున్నారు. ఇక్కడ పనిచేసిన కె. ప్రభాకర రావు ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లనున్నారు. సంగారెడ్డి మొదటి అదనపు కోర్టు న్యాయమూర్తి సుదర్శన్ రంగారెడ్డి జిల్లా కోర్టుకు బదిలీపై వెళ్తున్నారు. ఆయన స్థానంలో రంగారెడ్డి కోర్టు నుంచి జయంతి సంగారెడ్డికి రానున్నారు.

యథేచ్ఛగా నీటి దందా

- వ్యవసాయ బావుల నుంచి ట్యాంకర్ల ద్వారా పరిశ్రమలకు తరలింపు
- జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు



గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ గ్రామ సమీపంలో ట్యాంకర్లలో నీటిని నింపుతున్న దృశ్యం

భానుడి భగభగలతో నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. కొందరు అక్రమార్కులు దొడ్డిదారిన భూగర్భ జలాలను అడ్డగోలుగా తోడేస్తూ అక్రమ వ్యాపారానికి తెరలేపారు. అనుమతులు లేకుండా ఒక్కరోజులోనే వందలాది ట్యాంకర్ల నీటిని తోడేస్తూ పరిశ్రమలకు విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ ఏళ్ల కాలం నుంచి నీటి వ్యాపారం నడుస్తున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతులు లేకుండా బోర్లు వేయడంతోపాటు ఆర్వో ప్లాంట్లను నడుపుతున్నారు. ఇష్టానుసారం నీటి దందా కొనసాగిస్తుండటంతో ప్రజలకు నీటి కష్టాలు ఏర్పడుతున్నాయి. – జిన్నారం (పటాన్‌చెరు)

జిల్లా వ్యాప్తంగా జిన్నారం, పటాన్‌చెరు, అమీపూర్, గుమ్మడిదల, జహీరాబాద్, హత్నూర, సంగారెడ్డి తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో వేలకు పైగా వివిధ రకాల రసాయన, ఇతర పరిశ్రమలు ఉన్నాయి. పరిశ్రమలు నడవాలంటే నీటి వినియోగం తప్పక ఉంటుంది. పరిశ్రమల నీటి అవసరాన్ని ఆసరా చేసుకొని కొందరు అక్రమార్కులు నీటి వ్యాపారం చేస్తున్నారు. పరిశ్రమల అవసరాల కోసం యాజమాన్యాలు బయటి వ్యక్తుల నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుని వినియోగిస్తున్నారు. ఇదే అదునుగా చూసుకుని నీటి వ్యాపారులు గ్రామ శివారుల్లోని పంట పొలాల వద్ద ఉన్న బోర్లతో పాటు చెరువులు, కుంటల నుంచి ఉచిత విద్యుత్‌ను వినియోగిస్తూ నీటిని పరిశ్రమలకు తరలిస్తున్నారు. ఇలా నీటిని తోడేస్తుండటంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటుతున్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. స్థానిక రాజకీయ నాయకులతో అండదండలతో పారిశ్రామిక వాడల్లో ఈ వ్యాపారం సాగుతుందనే ఆరోపణలున్నాయి.

అనుమతులు లేకుండా ఆర్వో ప్లాంట్లు

పరిశ్రమలకు నీటిని విక్రయించేందుకు కొందరు బడా నాయకులు అనుమతులు లేకుండా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. పంట పొలాలకు ప్రభుత్వం ఇచ్చే ఉచిత విద్యుత్‌ను కూడా అక్రమార్కులు వాడుకుంటున్నారు. విద్యుత్ లేని సమయంలో బోర్లను నడిపించేందుకు పెద్ద జనరేటర్‌లను కూడా వినియోగిస్తున్నారంటే ఇక్కడ నీటి వ్యాపారం ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. గ్రామశివార్లలో అనుమతులు లేకుండా బోర్లు వేసి ప్రతినిత్యం లక్షల లీటర్ల నీటిని తరలిస్తుంటే గ్రామాల్లోని పంటపొలాల వద్ద ఉన్న బోర్లు అడుగంటి పోతున్నాయి. దీంతో గ్రామాల్లో నీటి సమస్య తీవ్రమవుతోంది. పారిశ్రామిక వాడలైన బొల్లారం, గడ్డపోతారం, కిష్టాయిపల్లి, ఖాజీపల్లి, బొంతపల్లి, దోమడుగు, గుమ్మడిదల గ్రామాల్లో ప్రజలు ఇప్పటికే కాలుష్యంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. భూగర్భ జలాలు ఎండిపోయి నీటి సమస్య కూడా ఎదురవుతుండటంతో ప్రజలు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అక్రమంగా నీటి వ్యాపారం చేస్తున్న వారిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం

నిబంధనలకు విరుద్ధంగా నీటిని విక్రయించటం నేరం. బోర్ల ద్వారా నీటిని తోడి తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల గడ్డపోతారం, కొర్లకుంట సమీపంలో నడుస్తున్న ట్యాంకర్లపై చర్యలు తీసుకున్నాం.

– భిక్షపతి, తహసీల్దార్, జిన్నారం

వేసవిలో రేటు రెట్టింపు..

జిన్నారం మండలంలోని గడ్డపోతారం, కిష్టాయిపల్లి, బొల్లారం, ఖాజీపల్లి, కొర్లకుంట, వావిలాల, నల్తూర్ గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి, గుమ్మడిదల, అనంతారం, దోమడుగు, కానుకుంట గ్రామాల నుంచి నిత్యం నీటి ట్యాంకర్లు వందల సంఖ్యలో నడుస్తుంటాయి. కొర్లకుంట గ్రామ పరిధిలోని చెరువు నుంచి పైపుల ద్వారా నీటిని ట్యాంకర్‌లలో నింపి పరిశ్రమలకు తరలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నిత్యం 10 నుంచి 15వేల వరకు ట్యాంకర్లు పరిశ్రమలకు నీటిని అందిస్తున్నాయి. ఒక్కో ట్యాంకర్ సామర్థ్యాన్ని బట్టి రూ. 4 నుంచి రూ. 6వేల వరకు విక్రయిస్తుంటారు. ప్రస్తుతం ఎండాకాలం కావటంతో ఈ ధరలు రెట్టింపు చేసి అమ్ముతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులే ఈ ట్యాంకర్లను నడుపుతుండటం గమనార్హం.

బరాబర్ గెలుస్తా..

అభివృద్ధి చేసి తీరుతా

- బీజేపీ జెండా.. మోదీ ఎజెండా
- కార్యకర్తల సహకారం.. ప్రజల మమకారం
- ప్రతీ సమస్య పరిష్కారమే ధ్యేయం
- పరిశ్రమలు తీసుకువస్తా.. యువతకు ఉపాధి చూపుతా
- మేనిఫెస్టో అమలు చేయని బీఆర్ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత
- 'సాక్షి'తో మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు



సాక్షి INTERVIEW

భారతీయ జనతాపార్టీ జెండా.. కేంద్రం జనరంజక పాలన.. మోదీ వేవ్‌తో గెలవడం ఖాయం. ప్రజలు, నాయకులు, కార్యకర్తల సహకారంతో 2లక్షల మెజారిటీతో గెలిచితీరుతా.. ప్రజలు ఏది కోరినా.. సమస్య ఏదైనా పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తా.. గత పదేళ్లలో మేనిఫెస్టోను అమలు చేయని కేసీఆర్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. దేశం, రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా చేసిన వ్యక్తి ప్రధాని మోదీ. పేదల విద్య కోసం రూ.100కోట్లతో నిధి ఏర్పాటు చేస్తానంటున్న వ్యక్తి మూడేళ్లుగా ఎమ్మెల్సీగా ఉండి ఎందుకు ఏర్పాటు చేయలేదు. లోక్‌సభ పరిధిలో ఆగ్రో బేస్డ్ పరిశ్రమలను తీసుకువస్తానని, యువతకు ఉపాధి చూపుతానని మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచార వేళ 'సాక్షి' పలకరించింది. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

– సాక్షి, సిద్దిపేట

రఘునందన్‌రావు దుబ్బాకలోనే ఓడిపోయారు అంటున్నారు. అలా అయితే కామారెడ్డిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓడిపోయారు కదా. మిమ్మల్ని ప్రజలు వద్దన్నారు. మళ్లీ ఇప్పుడు ఎలా గెలుస్తారు? కేంద్ర ప్రభుత్వ పనితీరు.. మచ్చలేని ప్రధానిగా పేరున్న మోదీ వేవ్‌తో గెలుస్తాం. జనం గుండెకు దగ్గరకు వెళ్తున్నా.. ప్రతీ ఒక్కరు ప్రధాని మోదీని కుటుంబ సభ్యుడిగా ఫీలవుతున్నారు. ప్రజల ఆశీర్వాదం, పార్టీ కార్యకర్తలు, నాయకుల సహకారంతో రెండు లక్షల ఓట్ల మెజార్టీతో గెలుస్తాను. అందుకోసం మా కార్యకర్తలు, నాయకులు పని చేస్తున్నారు.

మేనిఫెస్టో అమలు చేయని బీఆర్ఎస్

బీఆర్ఎస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. 2018 డిసెంబర్ ఎన్నికల్లో గెలిచి రెండో సారి అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. 'మా మేనిఫెస్టోనే భగవద్గీత.. ఖురాన్' అని అన్నారు. మరి నిరుద్యోగ భృతి ఏదీ? రూ. 3,116 ఇస్తానని చెప్పిన మాటలు ఏమాయె. 2020లో నేను గెలిచిన తర్వాత నా పాత మేనిఫెస్టో అమలు చేయాలనడం ఎక్కడి నీతి. వ్యక్తిగా గెలిచిన నేను అమలు చేయాలా? వ్యవస్థగా గెలిచి లక్షల కోట్లు దోచుకున్న కేసీఆర్ ఎన్నికల హామీలు అమలు చేయాలా? ప్రజలు బీఆర్ఎస్‌ను నమ్మడంలేదు. విశ్వసనీయతను కోల్పోయారు.

సరిపడా ఎరువులు..

ప్రధాని మోదీ రైతులకు ఎరువుల కొరత లేకుండా చేశారు. చెప్పులు లైన్‌లో పెట్టుకుని క్యూలైన్‌లలో ఎరువుల కోసం బారులు తీరేవారు. అదే ఇప్పుడు సరిపడా ఎరువులను సరఫరా అవుతున్నాయి. ఒక్కో యూరియా బస్తాపై సుమారు రూ.2వేల సబ్సిడీని బీజేపీ ప్రభుత్వం అందిస్తోంది. మేము అధికారంలోకి రానప్పుడు ఎంఎస్‌పీ ఎంత ఉండే ఇప్పుడు ఎంత ఉందో రైతులు ఆలోచించాలి. పీఎం కిసాన్ సన్మాన్‌నిధి కింద ప్రతీ పేద రైతుకు రూ.6వేలు అందిస్తున్నాం. భూసార పరీక్షలు నిర్వహించి రైతులు సాయిల్ హెల్త్ కార్డులు ఇచ్చి ఏ పంట సాగు చేయాలో తెలుసుకునేలా చైతన్యవంతులను చేశాం.

మూడేళ్లుగా ఎందుకు చేయలేదు

గెలిపిస్తే రూ.100 కోట్లతో అది చేస్తా.. ఇది చేస్తా అని వంద అబద్ధాలు చెప్పుకోవాల్సిన అవసరం నాకు లేదు. కాళ్లు మొక్కి ఉచితంగా తెచ్చుకున్న ఎమ్మెల్సీ పదవి చేపట్టి మూడేళ్లవుతోంది. ఏడాదికి రూ.100 కోట్లు పెడితే ఇప్పటి వరకు రూ. 300కోట్లు ఖర్చు పెట్టాలి. ఎందుకు సేవ చేయలేదు. బీఆర్ఎస్‌కు మెదక్‌లో మూడో స్థానమే. అందుకే అమలు చేయని హామీలు ఇస్తున్నారు. మూడేళ్లుగా అవ్వకు అన్నం పెట్టకపోగా.. పిన్నమ్మకు బంగారు గాజులు చేపిస్తా అన్నట్టుగా ఉంది వెంకట్రామిరెడ్డి తీరు.

ప్రజలు ఏది కోరుకుంటే అది..

బీజేపీ ఏజెండాను అమలు చేయడంతో పాటు ఈ నియోజకవర్గ అన్ని అవసరాలు, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తా.. అలాగే ఈ ప్రాంత ప్రజలు ఏది కోరుకుంటే అది చేస్తాం. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం నుంచి ఎదిగిన బిడ్డగా.. తెలంగాణ ప్రాంతానికి రావాల్సిన ప్రతీ పని... స్కీంను కచ్చితంగా తీసుకువస్తా అని హామీ ఇస్తున్నా.

ఆగ్రో బేస్డ్ పరిశ్రమలు..

మెదక్ సెగ్మెంట్ పరిధిలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉంది. 40 ఏళ్లు ఒకే కుటుంబానికి నం బంధించిన వారు పాలించారు. నాలుగు కంపెనీలను తీసుకురాలేదు. నలుగురికి ఉపాధి కల్పించలేదు. సిద్దిపేట, మెదక్, దుబ్బాక, గజ్వేల్ ప్రాంతాల్లో ఆగ్రో బేస్డ్ పరిశ్రమలు వస్తే బాగుంటుంది. వాటిని తీసుకువస్తా. స్థానిక సంస్థలను బలోపేతం చేస్తా. ప్రజలందరూ నన్ను ఆశీర్వదించాలని కోరుతున్నా.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణ వేడుకలో పాల్గొన్న మంత్రి దామోదర

జోగిపేట(అందోల్): పట్టణంలోని జోగినాథ స్వామి రథోత్సవాల్లో భాగంగా ఆదివారం శివ పార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలో మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో జోగినాథ కమిటీ చైర్మన్ డాకూరి శివశంకర్, మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, కమిటీ సభ్యులు ఎస్.సురేందర్ గౌడ్, పట్లూరి శివ శేఖర్, రంగా సురేష్, కె.నాగరాజు, దుర్గేష్, చందర్, అల్లే శ్రీకాంత్, డాకూరి వెంకటేశం, పట్లోళ్ల ప్రవీణ్ , డిబి నాగభూషణం, చాపల వెంకటేశం, గోపాల్, సందీప్ గౌడ్, డాకూరి శేఖర్ ,ప్రదీప్, యాదగిరి శీను, దిలీప్ పాల్గొన్నారు.

భక్తితోనే ముక్తి మార్గం



పూజలు నిర్వహిస్తున్న మాధవానంద సరస్వతి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మానవుడికి భక్తి మార్గంతోనే ముక్తి లభిస్తుందని తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆత్మకూర్ గ్రామంలో ఆంజనేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం నిర్వహించిన గురువందనం, దేవత పూజలు, ప్రతిష్ఠాహోమాలు, ధాన్యాధివాసం, ఫలపుష్పాదివాసం, శయ్యాదివాసం కార్యక్రమాల్లో మాధవానంద సరస్వతి పాల్గొన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే కుమారుడు చింతా సాయినాథ్, నాయకులు సత్య, అమరేందర్ రెడ్డి, గంగన్న పాల్గొన్నారు.

శ్రీను నాయక్‌ది రాజకీయ హత్య కాదు

డీఎస్పీ వెంకట్‌రెడ్డి

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలం సింగార్‌బొగుడ తండాలో శ్రీను నాయక్ మృతి రాజకీయ హత్య కాదని, సీసీ రోడ్డు వేయగా మిగిలిన కంకర గురించి జరిగిన గొడవలో భాగంగా శ్రీను నాయక్ అనే వ్యక్తి మృతి చెందాడని ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి వివరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల కోడ్ రాకముందే గ్రామసభ జనరల్‌బాడీ మీటింగ్ నిర్వహించి తండాలో రోడ్డు వేసేందుకు తీర్మానించారు. తర్వాత అదే తండాకు చెందిన జాదవ్ రాజు, సిర్గాపూర్‌కు చెందిన మరో ముగ్గురు వ్యక్తులు కలిసి ఉపాధిహామీ పథకం కింద ఏఈ మాధవనాయుడు, డీఈ మధుసూదన్‌రెడ్డిల పర్యవేక్షణలో సీసీ రోడ్డు పనులు ఇటీవల పూర్తి చేశారు. పనులకు వినియోగించగా మిగిలిపోయిన కంకరను సదరు పనులు చేపట్టినవారు అమ్మివేయగా కొనుగోలు చేసిన వ్యక్తులు తీసుకెళుతున్న క్రమంలో శ్రీను నాయక్ అడ్డుపడ్డాడు. దీంతో కాంట్రాక్టర్ రాజు, శ్రీను నాయక్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. గొడవపై శనివారం రాత్రి తండా పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహిస్తున్న క్రమంలో మాటామాటా పెరిగి జాదవ్ రాజు, అతని సోదరులు, వారి పిల్లలు కలిసి శ్రీను అతని తండ్రి పండరి, గోపాల్, రవిలను కర్రలు, రాళ్లతో కొట్టారు. తీవ్ర గాయాలై శ్రీనునాయక్ సంగారెడ్డి ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. రాజకీయ కక్షలతో జరిగిన హత్య అని ప్రతిపక్షాలు ఆరోపించాయి. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదులో ఎక్కడా రాజకీయ కక్షతో చంపినట్లు పేర్కొనలేదని, కంకర విషయంలో గొడవపడి దాడిచేయగా మృతిచెందినట్లు డీఎస్పీ వివరించారు.

రైతులను మోసగించిన ప్రభుత్వం

రామాయంపేట(మెదక్): రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వారిని మోసగించిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. ఆదివారం ఆయన సిద్దిపేట నుంచి మెదక్ వెళ్తున్న క్రమంలో మండలంలోని తొనిగండ్ల గ్రామ శివారులో రోడ్డు పక్కన నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆగి రైతులతో మాట్లాడారు. వంద రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని మాట ఇచ్చిన సీఎం మాట తప్పారని విమర్శించారు. అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి మొలకెత్తుతున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. ఎకరాకు రూ. ఐదు వందల బోనస్ ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతులు ధైర్యం కోల్పోవద్దని, మద్దతు ధర కోసం ప్రభుత్వంతో పోరాడుతామని హామీ ఇచ్చారు.

అలరించిన కుస్తీ పోటీలు



కుస్తీ పడుతున్న మల్లయోధులు

కల్హేర్(నారాయణఖేడ్): శ్రీరామ నవమి ఉత్సవాల నేపథ్యంలో నిజాంపేట మండలం బాచేపల్లిలో ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీలు విశేషంగా అలరించాయి. ఫైనల్లో గెలుపొందిన పైల్వాన్‌కు 5 తులాల వెండి కడెం బహూకరించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌గౌడ్, చరణ్‌గౌడ్, సుదర్శన్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత



పట్టుబడిన నగదుతో పోలీసులు

న్యాల్‌కల్(జహీరాబాద్) : మండల పరిధిలోని హుస్సెళ్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు దగ్గర ఆదివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి రాష్ట్రంలోకి వస్తున్న కారులో అనుమతి లేకుండా తీసుకెళ్తున్న రూ.68,100 నగదును సీజ్ చేసినట్లు హద్నూర్ ఎస్ఐ రామానాయుడు తెలిపారు.

కోదండరాంను సన్మానిస్తున్న నీలం మధు



నీలం మధును గెలిపించుకుందాం

పటాన్‌చెరు టౌన్: మెదక్ లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన బీసీ బిడ్డ నీలం మధు ముదిరాజ్‌ను గెలిపించుకుంటామని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆయనను నీలం మధు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ రాజకీయాలపై వారిద్దరు చర్చించారు. మెదక్ జిల్లాలో ప్రజా సంఘాలన్నిటిని ఏకం చేసి నీలం గెలుపునకు కృషి చేస్తామని కోదండరాం అన్నారు. ఒకే భావజాలంతో పనిచేస్తున్న బీఆర్ఎస్, బీజేపీలను ఈ ఎన్నికలలో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీజేఎస్ పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ నేత హనుమంత రెడ్డి, నిజ్జన రమేష్, శ్రీనివాస్, ధర్మార్జున్, రమేష్, సర్దార్, వినోద్, ఆశప్ప పాల్గొన్నారు.





వనదుర్గమ్మ.. దీవించమ్మా

పాపన్నపేట(మెదక్): మండుటెండలోనూ ఏడుపాయల్లో భక్తుల సందడి తగ్గలేదు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది భక్తులు మంజీర పాయల్లో స్నానాలు చేసి వన దుర్గమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి బోనాలు తీసి ఒడి బియ్యం పోశారు. తలనీలాలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పూజారి శంకరశర్మ దుర్గమ్మకు అర్చన చేసి భక్తులకు మంగళహారతి ఇచ్చారు. ఆలయ పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్, ధర్మకర్తలు భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు.





మల్లన్నకు కోటి దండాలు..

కొమురవెల్లి(సిద్దిపేట) : కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. కొంతమంది భక్తులు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, కేశఖండన, గంగిరేణి చెట్టు వద్ద ముడుపులు కట్టారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతోపాటు బోనం సమర్పించారు. సుమారు 15 వేల మంది దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా

క్రీడల్లో రాణించి సత్తా చాటాలి

గజ్వేల్ సీఐ సైదా



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ సైదా

గజ్వేల్‌రూరల్: క్రీడల్లో రాణించి సత్తా చాటాలని గజ్వేల్ సీఐ సైదా క్రీడాకారులకు సూచించారు. పట్టణంలోని ఐవోసీ పక్కన గల మైదానంలో హెచ్‌సీఏ, ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో క్రికెట్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు హరి శ్చంద్రప్రసాద్ సారథ్యంలో సమ్మర్ క్రికెట్ క్యాంపును అడిషనల్ సీఐ ముత్యంరాజుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత, క్రీడాకారులు చదువుల్లో రాణించడంతోపాటు క్రీడల్లో తమ ప్రతిభను చాటాలన్నారు. క్రీడా శిబిరాలు ఆటల్లో నైపుణ్యతను మెరుగు పరుచుకునేందుకు ఎంతగానో దోహదపడుతాయన్నారు. యువత, విద్యార్థులు వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని ఆటల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిన నర్సింలు, క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు రాజేందర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడు శ్రీనివాస్, క్రీడాకారులు బాకి స్వామి, గౌస్, లతీఫ్‌ఖాన్, రవి, గోపి, భాస్కర్, శ్రీను, ఖాజాపాషా, తదితరులు పాల్గొన్నారు.

9 మందిపై కేసు నమోదు

బందోబస్తు నడుమ శ్రీనివాస్ నాయక్ అంత్యక్రియలు



ర్యాలీ తీస్తున్న యువకులు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం సింగార్ బోగుడా తండాలో బీఆర్‌ఎస్ కార్యకర్త రాథోడ్ శ్రీనివాస్ నాయక్ అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. సీసీ రోడ్డు నిర్మాణం పనులు, కంకర విషయమై వివాదం జరగడంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణులు దాడులకు పాల్పడడంతో శ్రీనివాస్ నాయక్ మృతి చెందిన విషయం తెలిసిందే. సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం శ్రీనివాస్ నాయక్ మృతదేహాన్ని సింగార్ బోగుడా తండాకు తెచ్చారు. శ్రీనివాస్ నాయక్ మృతితో తండాలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. గొడవలు మళ్లీ జరుగకుండా ఉండేందుకు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, కంగ్టీ సీఐ రామకృష్ణారెడ్డి తండాలో పరిస్థితిని పర్యవేక్షించారు.అంతకు ముందు సిర్గాపూర్ నుంచి శ్రీనివాస్ నాయక్ మృతదేహాన్ని ర్యాలీగా తండాకు తరలించారు. ఈ విషయంలో రాజ్యానాయక్, హరి, సురేశ్‌తోపాటు మొత్తం 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

పటాన్‌చెరు టౌన్: ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం చిట్కూల్ గ్రామానికి చెందిన శివమ్మ (65) భర్త రాములు గ్రామ పంచాయతీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. గత నెలల నుంచి మానసిక స్థితి సరిగా ఉండడం లేదు. శనివారం భార్య శివమ్మ ఇంట్లో పడుకొని ఉండగా చెంపపై కొట్టి బయటికి ఈడ్చుకు వచ్చాడు. స్థానికుండా ఉండే ఇద్దరు యువకులు సముదాయించి శివమ్మను లోపలికి తీసుకెళ్లి పడుకోబెట్టారు. ఆదివారం ఉదయం చూసేసరికి మృతి చెంది కనిపించింది. మృతురాలి సోదరుడు పాండు సోదరి మృతి పై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులుక ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మామిడీలా

- వాతావరణ మార్పులతో తగ్గిన దిగుబడి
- రాలిపోతున్న కాయలు
- ఆందోళనలో రైతులు
- జిల్లాలో 13 వేల ఎకరాల్లో తోటల పెంపకం



చింతకుంట గ్రామంలో మామిడితోట

జోగిపేట(అందోల్): మామిడి రైతులకు గతేడాది లాగే ఈసారి కూడా కష్టం తప్పడం లేదు. ఎప్పుడు ఎలా నష్టపోయారో.. మళ్లీ అదే పరిస్థితి నెలకొంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించక రైతులు నష్టపోతున్నారు. కొన్ని చోట్ల ఎండ వేడిమికి మామిడి కాయలు రాలిపోగా, మరికొన్ని చోట్ల మామిడి చెట్లకు రోగం వచ్చి కాయలు వాటంతటఅవే రాలిపోతున్నాయి.

సంగారెడ్డి జిల్లాలో 13 వేల ఎకరాల్లో మామిడి తోటలు వేశారు. అందోలు, జహీరాబాద్, నారాయణఖేడ్, పటాన్‌చెరు, సంగారెడ్డి ప్రాంతాల్లో మామిడి తోటలు ఉన్నాయి. మొదట్లో ఎక్కువ మొత్తంలో చెట్లకు పూత వచ్చింది. కానీ ఈసారి వాతావరణ మార్పులతో పూత బాగా రాలిపోయింది. ఈ క్రమంలోనే వాతావరణ పరిస్థితుల కారణంగా కాత సరిగా రాలేదు. వేల రూపాయలు వెచ్చించి మామిడి తోట్లకు మందులు పిచికారీ చేసినా అంతగా కాత రాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురుగాలులు, అకాల వర్షాలతో కాయలు రాలిపోతూ కూడా తీవ్రంగా నష్టాన్ని చేకూరుస్తున్నాయి. కాయ దశకు చేరుకునే సమయానికి వాతావరణలో వస్తున్న మార్పులు ప్రభావం చూపడంతో నష్టం వస్తుంది. ఈసారి కాత సరిగా లేక తోటలు కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

ఎకరానికి రూ.50 వేల పెట్టుబడి

ఎకరానికి సుమారుగా 140 మొక్కలు చొప్పున పెంచగా పంట చేతికొచ్చే నాటికి రూ.50 వేలు వరకు పెట్టుబడి ఖర్చు అవుతుంది. తోటల్లో వందల సంఖ్యలో చెట్లుండగా అందులో పదిశాతం మాత్రమే సరిగా కాశాయి. డిసెంబర్, జనవరి మాసాల్లో పూత వచ్చి ఉగాది నాటికి పిందె స్థాయికి వస్తే దిగుబడి ఆశించిన స్థాయిలో ఉంటుంది. అలా కాకుండా ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఈ సంవత్సరం సరైన దిగుబడి వచ్చే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు మామిడి తోటలను సందర్శించి రైతులకు తగు సూచనలు చేయాల్సిన అవసరం ఉంది.



రాలిపోయిన కాయలు

కాయలు రాలిపోతున్నాయి



చింతకుంటలో 12 ఎకరాల్లో మామిడి తోటలు వేశాం. తోటల్లో కాయలు రాలిపోతున్నాయి. ఎందుకు రాలుతున్నాయో అర్థం కావడం లేదు. అధికారులకు చెప్పినా సరైన సూచనలు చేయడం లేదు. గాలి లేకున్నా రాలిపోయి నష్టపోవాల్సి వస్తుంది. పిందె దశలో అధికారులు సూచించిన మందులను వాడం, తోటను రక్షించుకునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. సరైన దిగుబడి లేక నష్టపోతున్నాం.

– శ్రీనివాస్, చింతకుంట రైతు

13 వేల ఎకరాల్లో సాగు

సంగారెడ్డి జిల్లాలో 13 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. అందులో 9 నుంచి 10 వేల ఎకరాల్లో ఉన్న చెట్లకు మాత్రమే పూత రాగా, వాతావరణ పరిస్థితుల మామిడి రైతులకు అనుకూలించ లేదు. పిందెగా ఉన్నప్పుడే సస్యరక్షణ చర్యలపై మామిడి రైతులకు అవగాహన కల్పించాం. రైతులకు అనుకున్నంతగా దిగుబడి రాకపోవచ్చు.

– కీర్తి హార్టికల్చర్ అధికారి, సంగారెడ్డి

చిన్న వయస్సులో పెద్ద కష్టం

- 19 ఏళ్లకే తల్లిదండ్రులను కోల్పోయిన బాలుడు
- చిన్నాచితక పనులు చేసుకుంటూ జీవనం
- బతుకు పోరులో అనాథ కష్టాలు

పాపన్నపేట(మెదక్): 'అందమైన బాల్యమని అందరూ అంటుంటారు..కానీ అంత అందమైంది కానే కాదని..'వాపోతున్నాడు పొడిచాకని కరుణాకర్. రెండు పదులు నిండని వయస్సులో అమ్మా, నాన్నలను పోగొట్టుకొని.. పూట గడువని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఆకలి తీర్చుకునే మార్గం కానరాక.. ఒంటరి జీవితం గడుపలేక అల్లాడి పోతున్నాడు. మండల కేంద్రమైన పాపన్నపేటకు చెందిన పొడిచాకని కరుణ, కిష్టయ్య దంపతులకు కూతురు క్రిష్ణవేణి, కుమారుడు కరుణాకర్ సంతానం. అర ఎకరా పొలమే వారి ఆస్తి. దీనికితోడు ఇతరుల పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ బతుకు బండి లాగిస్తూ వచ్చారు. కూతురు పెళ్లి, కుటుంబ ఖర్చులు కలిసి అప్పులు తడిసి మోపెడయ్యాయి. వీటికి కుటుంబ సమస్యలు తోడయ్యాయి. దీంతో జీవన పోరాటం చేయలేని కిష్టయ్య ఏడేళ్ల కిందట ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి కుటుంబ భారాన్ని భుజాలకెత్తుకున్న కరుణ కాయ కష్టం చేసుకుంటూ కుమారుడిని ఇంటర్‌లో చేర్పించింది. ఇంతలోనే కరుణ అనారోగ్యానికి గురి కావడంతో ఉన్న అరఎకరా పొలం తనఖా పెట్టింది. చాలీచాలని డబ్బులతో ఖరీదైన వైద్యం చేయించుకోలేక గత ఫిబ్రవరి నెలలో బిడ్డను ఒంటరి వాడిని చేసి తనువు చాలించింది. తల్లి అంత్యక్రియలు చేయలేక, కన్నీరు మున్నీరవుతున్న కరుణాకర్ దీనావస్థను చూసి గ్రామస్తులు కొంత మంది చేశారు.



కరుణాకర్

అనాథగా మారిన కరుణాకర్..

కన్న తల్లి చనిపోవడంతో కరుణాకర్ 19 ఏళ్లకే అనాథగా మారాడు. పూట గడవని పరిస్థితిలో దినసరి కూలీగా మారాడు. లేత వయస్సులో గొడ్డు కష్టం చేస్తున్నాడు. పని దొరికిన నాడు బుక్కెడు బువ్వ తింటూ.. దొరకని నాడు పస్తులుంటున్నాడు. చిన్న పాటి ఇంట్లో బిక్కుబిక్కుమంటూ ఒంటరి జీవితం గడుపుతున్నాడు. ఎవరైనా దాతలు బతుకు మార్గం చూపితే జీవితాంతం రుణ పడి ఉంటానని వేడుకుంటున్నాడు.

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య

వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇందులో రైలు కింద పడి ఒకరు, కుటుంబ కలహాలు, మనస్తాపంతో ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకున్నారు.

రైలు కిందపడి వ్యక్తి..



నరేశ్ (ఫైల్)

చేగుంట/వెల్దుర్తి(తూప్రాన్): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వడియారం శివారులో ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ తావూ నాయక్ కథనం మేరకు.. వడియారం గ్రామానికి చెందిన కొడి నరేశ్(33) ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి అప్పులపాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో ఆదివారం వడియారం మాసాయిపేట రైల్వే స్టేషన్‌ల మధ్యలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు పంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో మహిళ..

చేగుంట(తూప్రాన్): కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన చేగుంటలో చోటు చేసుకుంది. ఎస్ఐ బాలరాజు కథనం మేరకు.. చేగుంటకు వంగ సత్యనారాయణ భార్య వంగ మాధవి అలియాస్ స్వాతి (35) టైలర్ పని చేస్తుంది. సత్యనారాయణ ఇంటర్‌నెట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంత కాలంగా మాధవి, సత్యనారాయణ మధ్య గొడవలు జరుగుతున్నాయి. కుటుంబ కలహాలతో విసిగిపోయిన మాధవి ఆదివారం తెల్లవారు జామున ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. మృతురాలి సోదరుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



మాధవి(ఫైల్)

మనస్తాపంతో మహిళ..

నంగునూరు(సిద్దిపేట): మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకోగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. రాజగోపాల్‌పేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి కథనం మేరకు.. మగ్దుంపూర్ గ్రామానికి చెందిన ఒరుగంటి మల్లేశం, సిద్ధవ్వ (45) దంపతులు నాలుగేళ్ల కిందట కూతురు పెళ్లి చేశారు. దీంతో రూ.15 లక్షల వరకు అప్పులు అయ్యాయి. ఈ విషయంలో గొడవ జరగడంతో మనస్తాపం చెందిన సిద్ధవ్వ శనివారం రాత్రి పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను సిద్దిపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమారుడు ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సిద్ధవ్వ (ఫైల్)

ధాన్యం కుప్పను ఢీకొని వ్యక్తి మృతి

ఇద్దరిపై కేసు నమోదు

సిద్దిపేటరూరల్: రోడ్డుపై పోసిన ధాన్యపు కుప్పను ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తోర్నాల వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీను కథనం మేరకు.. దుబ్బాక మండలం అప్పనపల్లి గ్రామానికి చెందిన దుబాసి భాను(24) ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి 9 గంటలకు తిమ్మాపూర్ గ్రామంలో తన చెల్లెలు రిసెప్షన్ ఉందని బైక్‌పై వెళ్లాడు. అనంతరం రాత్రి 11.50 గంటల సమయంలో తిమ్మాపూర్ నుంచి తోర్నాల మీదుగా అప్పనపల్లికి బయలుదేరాడు. మార్గమధ్యలో తోర్నాల గ్రామ శివారు చింతచిన్నకుంట వద్ద తోర్నాల గ్రామస్తులు వాసూరి యాదయ్య, వాసూరి తిరుపతి ఇద్దరు రోడ్డుపై వడ్ల కుప్పలు పోసి దానిపై నల్ల కవర్ కప్పి చుట్టూ బండరాళ్లు పెట్టారు. రాత్రి సమయం కావడంతో ధాన్యం కుప్ప కనబడక భాను వడ్ల కుప్పకు ఢీకొని పక్కనే అన్న రాళ్లపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న ప్రశాంత్ ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యంగా రోడ్డుపై వడ్ల కుప్పలు పోసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సీఐ శ్రీను మాట్లాడుతూ.. రైతులు ఎవరైనా వారి ధాన్యాన్ని రోడ్లపై పోయొద్దని, దీని వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఎవరైనా రోడ్లపై ధాన్యాన్ని పోసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీను

కార్మికుడి హత్య

బతుకుదెరువు కోసం వచ్చి మృత్యువాత



సర్వన్ కుమార్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): కార్మికుడు హత్యకు గురైన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. బీహార్ రాష్ట్రం చాప్రా(సారన్) జిల్లా , ఘర్కా తాలూకా, బెల్వానియా గ్రామానికి చెందిన సర్వన్‌కుమార్ మాంజి (23) అన్నాదమ్ములతో కలిసి మూడు నెలల కిందట మనోహరాబాద్ మండలానికి బతుకుదెరువు కోసం వచ్చారు. ముప్పిరెడ్డిపల్లి గ్రామ శివారులోని వీపీఎం ఆగ్రో కంపెనీలో వెల్డర్‌గా పని చేస్తూ, అదే పరిశ్రమ గదిలో ఉంటూ జీవిస్తున్నారు. సర్వన్‌కుమార్ మాంజి శనివారం రాత్రి తోటి కార్మికులు సంజయ్, ఓం ప్రకాశ్ రాయ్‌లతో కలిసి బయటకు వెళ్లి సాయంత్రమైనా ఇంటికి రాలేదు. దీంతో సర్వన్ సోదరులు సునీల్ మాంజి, ధనుంజయ్ చుట్టు పక్కల వెతుకుతుండగా అతడు పని చేసే పరిశ్రమ గోడ వెనుకాల చెట్ల పొదల్లో తీవ్ర గాయాలతో చనిపోయి కనిపించాడు. చుట్టు పక్కల రక్తంతో పెద్ద రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. తన తమ్ముడి మృతికి తోటి కార్మికుడు ఓం ప్రకాశ్ రాయ్ కారణమని మృతుడి అన్న సునీల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇంటెలిజెన్స్ ఆరా!

'పంట రుణం చెల్లించాల్సిందే' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్

వట్‌పల్లి(అందోల్): సాక్షి దినపత్రికలో ఆదివారం సంచికలో ప్రచురితమైన 'పంట రుణం చెల్లించాల్సిందే.. కథనంపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అందోలు మండలం కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన దేవునూరి మాణయ్య అనే రైతు 2019లో ఎస్‌బీఐ జోగిపేట శాఖలో రూ.1.60 లక్షలు రుణం తీసుకోగా, వాటిని చెల్లించాలంటూ బ్యాంకు ద్వారా లీగల్ నోటీసును రైతుకు పంపిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం నుంచే ఇంటెలిజెన్స్ అధికారులు రిపోర్టర్‌లకు ఫోన్‌లు చేసి వివరాలను తెలుసుకున్నారు. అంతే కాకుండా రైతు మాణయ్యకు ఫోన్ చేసి ఎంత లోను తీసుకున్నావ్.. ఏ బ్యాంకులో తీసుకున్నావ్.. తీసుకున్న రుణం పంట రుణమా, మార్టిగేజ్ లోన్ తీసుకున్నావా? అంటూ వివరాలు తెలుసుకున్నారు. పంట రుణం తీసుకున్నట్లు రైతు సమాధానం ఇవ్వడంతో నీకు వచ్చిన నోటీసు కాపీని తనకు వాట్సాప్ చేయాలని సూచించినట్లు రైతు మాణయ్య సాక్షి దృష్టికి తీసుకొచ్చారు.

రెండు కార్లు ఢీ

ఇద్దరికి గాయాలు

పెద్దశంకరంపేట(మెదక్): రెండు కార్లు ఢీకొని ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన పెద్దశంకరంపేట నుంచి చీలాపల్లికి వెళ్లే సర్వీసు వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పెద్దశంకరంపేటకు చెందిన భూమయ్య కారులో సంగారెడ్డికి వెళ్తున్నాడు. అల్లాదుర్గం వైపు నుంచి నిజాంపేట వైపునకు వీరేశం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తున్నారు. చీలాపల్లి వద్ద అదుపుతప్పి రెండు కార్లు ఢీకొన్నాయి. ఇందులో ప్రయాణిస్తున్న అశ్విని, మారెమ్మలకు స్వ ల్పగాయాలయ్యాయి.



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

ఐస్‌క్రీమ్‌లో పురుగులు

నిర్లక్ష్యంగా సమాధానమిచ్చిన స్మార్ట్ పాయింట్ సిబ్బంది

గజ్వేల్‌రూరల్: ఐస్‌క్రీమ్‌లో పురుగులు బయటపడిన ఘటన గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ఆదివారం వెలుగు చూసింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రజ్ఞాపూర్‌కు చెందిన గొడుగు రాజు జగదేవ్‌పూర్ రోడ్డు చౌరస్తాలో ఉన్న ఓ స్మార్ట్ పాయింట్‌లో పిల్లల కోసమని బటర్‌స్కాచ్ ఐస్‌క్రీమ్‌లను కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి వాటిని తెరిచి చూడగా ఐస్‌క్రీమ్ నుంచి పురుగులు రావడాన్ని గుర్తించాడు. తిరిగి స్మార్ట్ పాయింట్ వద్దకు వెళ్లి అక్కడి నిర్వాహకులకు ఐస్‌క్రీమ్‌లో పురుగులు ఉన్నాయని చెప్పగా.. పొంతనలేని సమాధానమిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేయడం జరిగిందని, తమకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.



పల్లెకు 'ప్రకృతి' అందాలు

- గ్రామాల్లో కనువిందు చేస్తున్న వనాలు
- ఆహ్లాదకరమైన వాతావరణం
- పార్కులో తీరొక్క మొక్కలు

మర్కూక్(గజ్వేల్): గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల అందాలు చూపరులను కనువిందు చేస్తున్నాయి. పల్లెలను పట్టణాలుగా మార్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం తీసుకొచ్చిన పల్లె ప్రకృతి వనాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. చిన్న పిల్లలు, పెద్దలు కాసేపు సరదాగా ఆహ్లాదకరమైన వాతావరణం గడపాలంటే పట్టణాల్లో పార్కులకు వెళ్తుంటారు. కానీ గ్రామాల్లో అలాంటి వాతావరణం కనిపించదు. ఈ క్రమంలో గత ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టి ఊరి చివరన ఏర్పాటు చేసింది.

పల్లె ప్రకృతి వనంలోకి వచ్చేవారికి ఆహ్లాదకరమైన వాతావరణంతోపాటు చిన్నపిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. పెద్దలు ప్రకృతివనంలో వ్యాయామం చేసుకునే విధంగా నిర్మించారు. మాజీ సీఎం కేసీఆర్ పల్లె ప్రకృతి వనాలపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు కలెక్టర్‌తో సహా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడూ ప్రకృతి వనాలను పరిశీలించేవారు. ప్రతి పల్లెలో ప్రకృతి వనం నిర్మించి గ్రామాలకు నూతన శోభ తీసుకొచ్చే విధంగా అధికారులు కృషి చేశారు. సిద్దిపేట జిల్లాలోని ప్రతీ పల్లెలో ప్రకృతి వనాలను అధికారులు సొంత ఆలోచనలతో అందంగా తీర్చిదిద్దారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రతి పల్లెలో సంబంధిత జిల్లా అధికారులు వనాలను ఎప్పటికప్పుడూ పరిశీలించారు.ఈ పల్లె ప్రకృతి వనాలతో ప్రతి పల్లె పట్టణాలను తలపించేలా ఉన్నాయని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



మర్కూక్ ప్రకృతివనంలో రంగులతో వేసిన బొమ్మలు



మొక్కలతో ఏర్పాటు చేసిన ఏనుగు



ప్లాస్టిక్ పూల తోరణం

రూపురేఖలే మారిపోయాయి

గత ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రకృతి వనంలో గార్డెన్ ఏర్పాటు చేశాం. గ్రామ పెద్దలు వచ్చి వాకింగ్, చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు అమర్చాం. గోడలపై అందమైన బొమ్మలను వేశాం. మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ ప్రకృతివనాలు నిర్మించాం. జిల్లాలోనే మర్కూక్ మండల ప్రకృతివనాలు ఆదర్శంగా ఉండేలా నిర్మించాం.

– ఎంపీడీఓ అఫ్జలుద్దీన్

ఆదర్శంగా నిర్మించాం

మర్కూక్ పల్లె ప్రకృతి వనం జిల్లాలోనే ఆదర్శంగా నిర్మించాం చూపరులను ఆకట్టుకునే విధంగా తీరొక్క మొక్కలను నాటాం. పార్కులోకి వచ్చేవారికి ఆహ్లాదరకరమైన వాతావరణం ఉండే విధంగా పచ్చని తోరణాలు, మొక్కలతో బొమ్మలు, అలాగే గోడలపై జంతువుల బొమ్మలను వేసి అందంగా తీర్చిదిద్దాం.

– అచ్చంగారి భాస్కర్, మర్కూక్ మాజీ సర్పంచ్

నిండు నూరేళ్లు బతకాలనీ..

ఓ రిటైర్డు ఉపాధ్యాయుడి పూజలు

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణానికి చెందిన గౌరిశెట్టి చంద్రమౌళి అనే రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి వంద ఏళ్లు ఆయురారోగ్యాలతో బతకాలని విచిత్ర కోరిక కలిగింది. దాని కోసం ఏకంగా మూడు రోజులపాటు సహస్ర చంద్రదర్శనం అనే పూజ చేశారు. ప్రస్తుతం అతడి వయస్సు 84 ఏళ్లు. ఇతడికి 100 ఏళ్లు బతకాలని కోరిక కలగడంతో ఆయుష్షు ఎలాగైనా పెరగాలని కరీంనగర్‌కు చెందిన ఓ వేద పండితుడిని ఆశ్రయించాడు. కొన్ని పూజలు చేసి తులాభారం ఇవ్వాలని సలహా ఇవ్వడంతో వాటిని పాటించాడు.

82 నుంచి 84 ఏళ్లు పైబడిన వారే..

సహస్ర చంద్ర దర్శనం అనేది ఆరోగ్యం, ఆనందం, దీర్ఘాయుష్షు కోసం నిర్వహించే శాంతి కార్యం. ఏడాదికి 12 పౌర్ణమలు చొప్పున 82 నుంచి 84 ఏళ్లు నిండిన వారు దాదాపు 1,000 పూర్ణిమలు చూసి ఉంటారు. అలాంటి వారే ఈ సహస్ర చంద్ర దర్శనం కార్యక్రమం చేయాలి. ప్రస్తుతం చంద్రమౌళికి 84 ఏళ్లు కావడంతో ఈ వేడుక చేశారు.

సహస్ర చంద్రదర్శన హోమం

ఆయుష్షు పెరగాలంటే వేదపండితులు సూచించిన విధంగా మూడు రోజుల పాటు చంద్రమౌళి పూజలు చేశారు. ఇందులో రెండు రోజులు (శుక్రవారం, శనివారం) నూతన వస్త్రాలు ధరించి, అభిషేకాలు, మంగళ స్నానాలు చేశారు. చంద్రమౌళి 1008 కలశాలతో పూజలో భాగంగా సర్వ దేవతలను హోమంకు ఆహ్వానించి కార్యక్రమం నిర్వహించారు. మూడవ రోజు ఆదివారం తన బరువుకు తగ్గట్లుగా వస్తు ద్రవ్యంతో తులాభారం వేశారు. తులాభారం చేసిన ద్రవ్యాన్ని ఓ మందిరం, అనాథ ఆశ్రమం, పేద వాళ్లకు ధాన ధర్మాలు చేయాల్సి ఉంటుంది. సహస్ర చంద్ర దర్శన హోమం నిర్వహిస్తే పార్వతీ పరమేశ్వరులుగా భావిస్తారు. కార్యక్రమానికి వచ్చిన బంధువులు, మిత్రులు వారి ఆరోగ్యం కోసం పిండితో తయారు చేసిన దీపం రూపంలో పూజలు చేసి దీవించారు.



తులాభారం వేసుకుంటున్న చంద్రమౌళి